క్లుప్తంగా

పీఆర్‌టీయూ క్యాలండర్ ఆవిష్కరణ


క్యాలండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో బోడంనాయుడు తదితరులు

కొయ్యూరు: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ క్యాలండర్‌ను 2023ను ఎంఈవో బోడంనాయుడు గురువారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి లకే సురేష్, అసోసియేట్ అధ్యక్షుడు వి.తలుపులు, కార్యదర్శులు జి.పంతులు, కె.సతీశ్, ఈ.సతీశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉపాధ్యాయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

విశాఖలో 21, 22 తేదీల్లో వీహెచ్‌పీ సమావేశాలు

అడ్డతీగల: విశాఖపట్నం ఉక్కునగరం అంబేడ్కర్ కళాక్షేత్రం సెక్టార్-5లోని సీడబ్ల్యూసీ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్-1లో 21, 22 తేదీల్లో వీహెచ్‌పీ ప్రాంత సమావేశాలు నిర్వహించనున్నట్టు వీహెచ్‌పి ప్రాంత ప్రముఖ్ ఎస్.భావన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వార్షిక యోజన కార్యక్రమాలపై సమీక్ష, కేంద్రీయ క్షేత్ర అధికారుల పర్యటనలు , పలు అంశాలపై ప్రత్యేక నిర్ణయాలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. సమావేశాలకు అపేక్షిత కార్యకర్తలు అందరూ హాజరుకావాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


అరకులోయ సీఐ దేముడు బాబు

అరకులోయ రూరల్: సంక్రాంతి వేడుకల్లో అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అరకులోయ సీఐ జి.దేముడుబాబు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పరిధిలోని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని ఎటువంటి అల్లర్లు, గొడవలు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జూదాలు, పందెం ఆటలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పొడొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాల భవనం పనులకు భూమిపూజ


పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ పద్మ

జి.మాడుగుల: వంతాల పంచాయతీ ఎం.సంగం గ్రామంలో గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులకు సర్పంచ్ జి.పద్మ భూమిపూజ నిర్వహించారు. ఎంపీపీ పాఠశాలకు నూతన భవాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఆయా భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. హెచ్‌ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషాదేవి

చింతపల్లిరూరల్: చింతపల్లి పంచాయతీ మల్లవరంలో గురువారం ఎంపీపీ అనూషాదేవి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గిరిజనులు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి రహదారి సమస్యను తీసుకువచ్చారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేశారు. పనులను ప్రారంభించిన ఎంపీపీ సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

‘గడప గడప’తో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- శివారు గ్రామాల్లో ‘గడప గడపకు’


నందకోటలో గ్రామస్తులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ నీలవేణి తదితరులు

అనంతగిరి: ప్రతి గడపలో అందరూ సంతోషంగా ఉండాలన్నాదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా పాలన సాగిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని భీంపోల్ పంచాయతీ గొంద్రంగిపాడు, చిమిడిపల్లి, నందకోట గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులకు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 217 గడపలను ఆయన సందర్శించారు. విపరీతమైన చలిని సైతం లెక్కచేయకుండా ఉదయం 6 గంటలకే కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారన్నారు. ఫలితంగా అందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రతి గడపలో సంతోషంగా ఉన్నారన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేశారన్నారు. చిమడిపల్లి, నందకోట, గొంద్రింగిపాడు గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీటీసీలు అశోక్, తాటినాయుడు, సర్పంచ్‌లు అప్పారావు, సీతయ్య, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యానారయణ, వైస్ సర్పంచ్ అప్పలకొండ, నాయకులు గంగులు, మాజీ సర్పంచ్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

వాడవాడలా వేడుకలు, సేవా కార్యక్రమాలు


అరకులోయ డిగ్రీ కాలేజీలో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది


చింతపల్లిలో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


పాడేరులో 2కే రన్‌లో బీజేపీ శ్రేణులు


అడ్డతీగలలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద గ్రామస్తుల నివాళి

చింతపల్లి: జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని విగ్రహాల, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ వివేకానందుని జీవితం యువతకు ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. . వివేకానందుని జీవిత విశేషాలను వివరించారు. యువతకు దేశం యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పారని, సామాజిక స్పృహతో దేశభక్తిని స్వాతంత్ర కాంక్షను ఆయన రగిల్చారన్నారు. సమాజాన్ని ప్రభావితం చేయగల అనేక రచనలు చేశారన్నారు. యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడారు. చింతపల్లి మండల కేంద్రంలో జరిగిన వివేకానందుని జయంతి కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. వివేకానందుని జీవితం యువతకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచ్ పుష్పలత, కార్పొరేషన్ డైరెక్టర్ మీరా తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: పాడేరులో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించారు. ఈ మేరకు తలార్‌సింగి జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్ మీదుగా మోదకొండమ్మ అలయం వరకు సాగింది. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. నాయకులు రాజారావు, భాస్కర్‌రావు, రామకృష్ణ, మత్స్యకొండబాబు, కృష్ణరావు, నవీన్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలోని జరిగిన వేడుకలో విశ్వ హిందూ పరిషత్ ప్రాంత ప్రముఖ్ ఎస్.భావన్నారాయణ, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో గురువారం ఉప తపాలా శాఖా కార్యాలయాన్ని అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా పరిధిలో 549 బ్రాంచి పోస్టాఫీసులు ఉండగా 45 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయన్నారు. వీటిలో నర్సీపట్నం, చింతపల్లి, యలమంచి, పాడేరు, అరుకులో మాత్రమే సొంత భవనాలు ఉన్నాయన్నారు. మరి కొన్నిచోట్ల నూతన భవనాల నిర్మాణానికి ప్రతి పాదనలు పంపామన్నారు. రూ. 32 లక్షలతో ఇక్కడ భవనం నిర్మించామన్నారు. నర్సీపట్నం సౌత్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోస్టల్ అసిస్టెంట్ అజిత్ బట్టాచార్య, స్థానిక పోస్టుమాస్టార్ రమణారావు, బీపీఎంలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంలో చెత్తకుండీల ఏర్పాటు


కొత్తపల్లి గ్రామంలో ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన చెత్త కుండీలు

జి.మాడుగుల: ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని అన్నవరం ఫారెస్టు సెక్షన్ అధికారి వెంకటరావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తపల్లి జలపాతం, కొక్కిరాపల్లి ఘాట్‌తో పాటు పలుచోట్ల అటవీశాఖ సిబ్బంది చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వాడడం వలన పర్యావణం దెబ్బతింటుందని, ప్రజలు అనేక ఇబ్బందులు, సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్లాస్టిక్‌ను వాడటం పూర్తిగా తగ్గించాలని ఆయన కోరారు. చెత్తను బయట వేయకుండా చెత్త కుండీల్లో వేయాలని ఆయన సూచించారు. ఎఫ్‌బీవోలు ప్రసాద్ గంగరాజు, ఏబీవో గోవింద్, దివ్య తదితరలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గం


అధ్యక్ష, కార్యదర్శులు మత్స్యరాజు, రమేష్

పాడేరు రూరల్: అల్లూరి సీతారామరాజు కాంటాక్ట్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గడ్డంగి మత్స్యరాజు(హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకుడు), ప్రధాన కార్యదర్శిగా బొమ్మలాట రమేష్ (ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు)లను నిమమించారు. జిల్లా మహిళ కార్యదర్శిగా కె.తిరుపతమ్మను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు కార్యవర్గంలో కొనసాగనున్నారు. వీరి నియామకాన్ని కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ఆర్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రమేష్‌నాయుడు ధ్రువీకరించారు.

కాలినడకన సింహగిరికి అప్పన్న మాలధారులు


ఇరుముడులతో భజన చేస్తున్న సింహాద్రప్పన్న మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సింహాద్రప్పన్న మాలధారణ భక్తులు గురువారం సాయంత్రం ఇరుముడులు ధరించి కాలినడకన సింహాచలం స్వామి వారికి మొక్కలు చెల్లించేందుకు బయలు దేరారు. ధనుర్మాసం సందర్భంగా గత డిసెంబర్ 16న మాలధారణ వేసిన వీరంతా భజనలు చేస్తూ ఇరుముడులతో బయలు దేరారు. వీరిలో స్వామి దాసుడు వేగి హరికృష్ణతోపాటు మరో 30 మంది స్వాములు, మరో 20 మంది సాధారణ భక్తులు ఉన్నారు. స్వామివారి ఆలయానికి శుక్రవారం ఉదయం చేరుకుంటారు.

బిల్లులు మంజూరు చేయాలి

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ జబడ గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కె.త్రినాథ్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో చేపట్టిన ఎన్టీఆర్ గృహాలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న గృహాలు మంజూరైన వారికి బిల్లులు త్వరితగతిన అందజేయాలని కోరారు.

వాహనాల తనిఖీ


తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ సతీష్

హుకుంపేట: హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా ప్రయాణాలు సాగిస్తు రోడ్డు మీదకు కనిపిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని అరుకు-పాడేరు ప్రధాన రహదారి రాళ్లగెడ్డ వంతెన వద్ద ఆయన తమ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వెళ్తున్నవారిని, మైనర్ వాహనచోదకులను నిలిపి హెచ్చరించారు. వాహనచోదకులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు తప్పనవి హెచ్చరించారు. సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

తపాల సేవలపై అవగాహన


బీమా దరఖాస్తులను అందజేస్తున్న పోస్టల్ శాఖ సిబ్బంది

డుంబ్రిగుడ: తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరకు ఆర్ఎస్ పోస్టుమాస్టర్ కె.సుందరరావు అన్నారు. మండలంలోని తూటంగి పంచాయతీ కేంద్రంలో గురువారం ఆయన సిబ్బందితో కలిసి తపాల శాఖ అందిస్తున్న పొదుపు పథకాలు, బీమా సదుపాయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. తపాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది సీతారాం తదితరులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బండారుగూడెం


విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం

ఎటపాక: మండంలోని బండిరేవు గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొమరం రాజారావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా బండారుగూడెం జట్టు నిలిచింది. గత తొమ్మిది రోజులుగా జరిగిన ఈ టోర్నీలో 12 జట్లు పాల్గొనగా గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విస్సాపురం, బండారుగూడెం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. విజేతగా నిలిచిన బండారుగూడెం జట్టుకు కొప్పుల రాంబాబు రూ.10వేలను, రన్నర్స్‌గా నిలిచిన విస్సాపురం జట్టుకు రంబాల కార్తీక్ రూ.5వేలను, ట్రోఫీలను అందజేశారు. ఆర్.నాగేశ్వరరావు, భీమయ్య, ఎస్.వుంగరాజు, జె.ముదరాజు, సత్యనారాయణ, రాజేష్, సీతారామయ్య పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రాజ్‌కుమార్

గూడెంకొత్తవీధి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయాలని, ఇందుకు పోలింగ్ బూత్‌ల పరిధిలో బీఎల్‌ఓలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి తహసీల్దారు రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని బీఎల్‌ఓలతో ఓటరు నమోదు కార్యక్రమంపై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 1నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా గుర్తించి వారి పేర్లను నమోదు చేయాలన్నారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రత్యేకంగా పీవీటీజీ గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తిచేయాలన్నారు.పోలింగ్ కేంద్రాల పర్యవేక్షకులు మహదేవ్, కామేశ్వరరావు, చిన్నారావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


వైఎస్‌ఆర్ బీమా సొమ్మును సత్తి కుటుంబానికి అందిస్తున్న సర్పంచ్ సుభాష్‌చంద్ర..

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ ముంచంగిపుట్టు గ్రామానికి చెందిన కొర్రా సత్తి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. దీంతో సత్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10లక్షలు మంజూరు చేసి, తక్షణ సాయం కింద రూ.10 వేలను గురువారం సర్పంచ్ ఎస్.సుభాష్‌చంద్ర, నాయకుడు మత్స్యలింగం, గ్రామ పెద్దలు అందజేశారు. మిగిలిన బీమా సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. ధైర్యంగా ఉండాలని సత్తి కుటుంబ సభ్యులకు సర్పంచ్ సుభాష్ భరోసా ఇచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ మత్స్యరాజు, గ్రామ పెద్దలు ప్రసాదరావు పడాల్, పాపారావు, ఉపాధ్యాయులు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు సంక్రాంతి శోభ


గిరిజన గ్రామాల్లో థింసా నృత్యం చేస్తున్న యువతీ, యువకులు

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పల్లెకు పండగ కళ సంతరించుకుంది. మార్కెట్‌లు కిటకిటలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, ఇతరత్రా షాపుల్లో జోరగా వ్యాపారం జరుగుతోంది. ఇళ్ల వాకిళ్ల రంగు రంగుల ముగ్గులతో కళకళలాడుతున్నారు. బంధు, మిత్రులతో సందడిగా మారాయి. గ్రామాల్లో డూడూ బసవన్న బుడియా సందడి మొదలైంది. డుంబ్రిగుడ మండలంలోని లోగేలి, సొవ్వ, గసభ, సాగర పంచాయతీల్లో సంక్రాంతి సందడి నెలకొంది. గ్రామాల్లో చిన్నారుల బుడియా వేషధారణతో ఆకట్టుకున్నారు. యువతీ, యువకులు థింసా నృత్యాలతో సందడి చేస్తున్నారు.


పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

పెదబయలు: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సిస్టర్ సారా ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భోగి మంట వేసి సందడి చేశారు

అ‘పూర్వ’ కలయిక


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1985-86 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కలిశారు. ఒకొరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి పాత మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. చదువులు నేర్పిన అప్పటి గురువులు టి.వి.శర్మ, అంబటి వీరభద్రరావు తదితరులు ఘనంగా సన్మానించి, అభినందన పత్రాన్ని అందజేశారు. పూర్వ విద్యార్థులంతా సహపంక్తి భోజనాలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. సుమారు 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విశేష కృషి చేసిన పూర్వ విద్యార్థి కోటమ రాధాకృష్ణను గురువులు, తదితరులు అభినందించారు. డాక్టర్ రాధాకృష్ణ ప్రస్తుతం ఇల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నారు. ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ (టీఎఫ్‌ఐ) చాగంటి సాహితి తల్లి చాగంటి సీతాదేవి ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని. ఆమె కూడా కార్యక్రమంలో పాల్గొని స్నేహితులను కలసి ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థులు రాధాకృష్ణ, సీతాదేవి, వెంకటరమణ, శేఖర్, రమణ, ఏసుబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో తాగునీటి సమస్య పరిష్కారం


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని బూసిపుట్టు పంచాయతీ బొర్రపనస గ్రామ గిరిజనులు శ్రమదానంతో నీటి సమస్య పరిష్కరించుకున్నారు.గ్రామంలో నీటి సరఫరా చేసే పైపులైన్ వ్యవస్థ కొద్ది నెలలుగా పాడైంది. స్థానికులు తాగునీటి తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గురువారం గ్రామస్తులు తీవ్రంగా శ్రమించి నీటి కుండీ నుంచి గ్రామం వరకు పైపులైన్‌ను మరమ్మతులు చేసి నీటి సరఫరా వచ్చే విధంగా చేసుకున్నారు. దీంతో బొర్రపనసలో 150 కటుంబాలకు నీటి సమస్య తీరినట్టు అయిందని ,నీటి పైపులైన్‌ను పూర్తిగా మనమ్మతులు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సత్యం, బాహనే, శివయ్య, భాస్కర్, పూల్ తదితరులు కోరారు.

రైతులకు అండగా ప్రభుత్వం


సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు తదతరులు

కూనవరం: కోతులగుట్టలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పాఠశాల భవనంలో సొసైటీ కార్యాలయాన్ని ఏర్పాటుకు జేసీ అనుమతించడంతో గురువారం వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కె.అనసూయ మాట్లాడుతూ సొసైటీ కార్యాలయానికి సొంత భవనం చేకూరుందని, రైతులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, జెడ్పీటీసీ గుజ్జా విజయ మాట్లాడుతూ సొసైటీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె స్పందించి జేసీతో మాట్లాడి భవన సదుపాయం కల్పించారన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. సర్పంచ్‌లు పార్వతి, నిరోషా, వెంకన్నబాబు, సొసైటీ డైరెక్టర్లు గంగాధర్, బాబు, పిచ్చయ్య, హరనాథ్ బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.